


కవిత. సంపుటి 1. జయ-భాద్రపదం. (సంవత్సరానికి 3 సంపుటాలు.) సంకలనం: శ్రీమతి అబ్బూరి ఛాయాదేవి, ఎం. ఏ. వెల: రూ. 1-8-0. ప్రాప్తిస్థానం: A - 10 - 431, హిమయత్ నగర్, హైదరాబాదు.

"కవిత" వంటి విశిష్ట స్వభావంగల ఒక పత్రిక ఈ నాటికి తెలుగునాట వెలువడడం ఒక విశేషం. అంతకన్నా విశేషం వందా, రెండు వందలకు పైగా ఉన్న మన తెలుగు పత్రికలలో ఏ రెండో మూడో తప్ప తక్కినవన్నీ ఈ పత్రికను గురించి మూకీభావం వహించడం. అన్నిటికన్నా గొప్ప విశేషం ఆ గుర్తించిన పత్రికలైనా ఒక కన్ను మూసుకొనో, లేక ఇంగ్లీషు పలుకుబడిలోవలె బుగ్గని నాలిక పెట్టుకొనో ఎగబడడం! (దాన్నే తెలుగులో నంగనాచితనం అనవచ్చు) మాటవరసకి ఆస్కార్ వైల్డ్ అభిప్రాయాలు బూజుపట్టినవే అనుకుందాం, అబ్బూరి రామకృష్ణరావుగారి కేమి కావాలో ఆయనకే తెలియదనుకుందాం, ఒక గీతం కొంతవరకూ బాగుండి తరవాత బాగుండడం మానేసిందనుకుందాం - అయితే ఏమయినట్టు? సరిహద్దులను కరిగించడమే కవిత్వం మహత్త్వం అయినప్పుడు ఇదంతా ఏదో విదేశీ వ్యవహారంలా ఉందని విస్తుపోవడంలో ఏ మాత్రం "జాతీయత" ఉంది? ఇంతకీ రోడ్డు అనే మాట అచ్చ తెనుగు పదం అనుకునేవాళ్లున్నారు. ఆ మాటకొస్తే వాళ్లదే సరైన దృక్పథం. కృత్రిమమైన గిరులు గియ్యబోవడం తెలివితక్కువతనం. వాటిని కాపలా కాస్తూ హారాహుషార్ అని అరవడం పిచ్చితనం.

సాహిత్యరంగంలో "కవిత" వంటి పత్రిక ప్రవేశించినప్పుడు సహృదయులంతా స్వాగతం చెప్పవలసి ఉంటుందిగాని మూలుగులూ, ఫిర్యాదులూ వినబడకూడదు. కవితా స్వభావం గురించి ఆలోచించేవాళ్లు-కొద్దిమందేఅనుకోండి-రోజూ మూలుగుతూనే ఉన్నారు; ఇది బాగులేదు, అది బాగులేదు అని ఏడుస్తూనే ఉన్నారు. ఇప్పుడు "కవిత" కొక ప్రత్యేకమైన వేదిక లభించింది కాబట్టి కవనంమీద గాఢాభిమానం ఉన్నవారంతా కవితా విజయానికి తోడ్పడాలి. నిజమే! సంప్రదాయ ఛ్ఛందస్సులు కొందరికి కావాలి! భావ కవిత్వం పసందు చేస్తారు మరి కొందరు. విప్లవ ధోరణులు తప్ప మరేవీ నచ్చనివారు మరికొంద రున్నారు. ఇలాగ విభిన్న దృక్పథాలకు చెందినవా రందరికీ కూడా 'కవితలో' ప్రాతినిధ్యం ఉంటేనే అప్పుడు తెలుగు కవిత్వపు సమగ్ర స్వరూపం ఇందులో సరిగా ప్రతిబింబితమవుతుంది. రకరకాల కవిత్వాల కలగలుపు కాకుండా గుర్తించడాని కనువైన దృక్పథాలూ, వ్యవస్థలూ ఇందులోంచి బయలుదేరాలి. అది బలీయమైన సంపాదకీయ బాధ్యత. ముమ్ముందు రాబోయే సంచికలలో ఈ బాధ్యత సుష్ఠుగా నిర్వహించబడుతుందని ఆశిద్దాం.

అదొహాటిన్నీ, ఇతర భాషలనించి అనువాదాలు చెయ్యడంతో బాటు ఆయా కవులను గురించి పరిచయాలను కూడా ప్రకటిస్తే బాగుంటుంది. ఇతర భాషల కవుల్నే అన్నమాటేమిటి అంతమంది రచయితల్నీ పాఠకులకి పరిచయం చెయ్యడం చాలా మంచిది.

కవితా విషయక చర్చలకి కూడా కొన్ని పుటలను ప్రత్యేకించడం మిక్కిలి అభిలషణీయం.

"కవిత"కి స్వాగతం!

—శ్రీ. శ్రీ.